"అజ్ఞానం"

విషయం: "ఎక్కడికి పారిపోతావు, తమ్ముడూ?"

ఈనాడు యువకులు ఇళ్ళల్లోంచి పారిపోతున్నారు. వెనక లేదని కాదు. పరీక్షలో కాపీచేస్తూ పట్టుబడి, ఆనేరంతో ఇంట్లో పెద్దల్ని ఎదుర్కొనే ధైర్యం లేక, ఎక్కడికో వెళ్ళిపోయి, బైరాగుల్లో కలిసిపోయి, ఏ పది పదిహేనేళ్ళ తరవాతో తన ఊళ్ళో, తనింటివారు గుర్తుపట్టినట్లు పసిగట్టి, మళ్ళా ఆ ఊళ్ళోంచి వెళ్ళిపోయిన వొకరిద్దరి వ్యక్తుల ఉదంతం కథకింద చెప్పుకునే వారు వెనక. కోరిన కన్యని పెళ్ళాడే అవకాశం లేక, అయిష్టమైన పెండ్లికి వొప్పుకోలేక ఇంట్లోంచి పారిపోయిన యువకులు, వెనక కొందరు లేకపోలేదు. కాని ఇట్లాంటివి అరుదుగా జరిగేవి. నూటికి కోటికి వొకటి — అద్భుత సంఘటనగా, అపూర్వమైందిగా పరిగణింపబడి, కథకీ, నవలకీ వస్తువయ్యేది.

ఇటీవల ఇళ్ళల్లోంచి పారిపొయ్యే యువకులసంఖ్య పెరిగింది. ఇంచుమించు ప్రతిరోజూ, ఎవరో వొకరు ఇంట్లోంచి వెళ్ళిపోయిన ప్రకటన చూస్తూనే వుంటాం. వెళ్ళిపోయిన వ్యక్తి ఆచోకీ తెలియపరిచినవారికి ఏదో బహుమతి ఇచ్చుకుంటామని ప్రకటిస్తారు. పోలీసు శాఖకి ఫిర్యాదు చేస్తారు. వెళ్ళిపోయిన ఉదంతం రూఢిపరుస్తూ మేజిస్ట్రేట్ పంపిన పత్రాన్ని రేడియోలో వినిపిస్తారు. కొన్ని పత్రికలు, పారిపోయినవారి ఫొటోలు ప్రచురిస్తాయి. "ఇంటికి రా, అమ్మ బెంగెట్టుకుంది. ఏమీ అనం." "నువ్వు వెళ్ళినప్పుడినుంచీ తమ్ముడు అన్నం తినడంలేదు — స్కూలు మానేశాడు — తిరిగి రా — నీ వెట్లా చెప్తే, అట్లా చేస్తాం." "మతి చెడిన అన్నయ్యని ఆస్పత్రిలో చేర్పించాం — పదే పదే నిన్నే స్మరిస్తున్నాడు — వెంటనే రా." "ఆ పిల్లనే చేసుకుందువు కానిలే — ఇంత మాత్రానికే వెళ్ళిపోవాలా? అత్తయ్య మంచం పట్టింది. తిరిగి రా." ఇట్లాంటి

బుచ్చిబాబు

ప్రకటనలు, రోజూ ఏదో వొక పత్రికలో చూస్తూవుంటాం.

మతి చెడి తిరిగేవార్నీ, దోవ తప్పి ఎటోపోయిన పిల్లల్నీ, నేరం చేసి శిక్షకి బెదిరి పారిపోయేవార్నీ విడిచివేద్దాం. ఇట్లాంటివి, అన్ని కాలాలలోనూ, అన్నిచోట్లా జరుగుతూనే వుంటాయి. ఇట్లా కాక, కుటుంబంవారితోనో, సమాజంతోనో పేచీవచ్చి, పారిపోయే యువకుల సంఖ్య పెరిగిందంటున్నాను. రోజూ వొకరు, ఇంట్లోంచి పారిపోతున్నారని చెప్పొచ్చు. ఈ లెక్కని, తెనుగుదేశంలోనే, ఏడాదికి మూడు, నాలుగొందల మంది యువకులు పారిపోతున్నారనుకుందాం. దేశం మొత్తంమీద, వొక ఏడాదిలో, ఐదారువేలమంది యువకులు ఇళ్ళల్లోండి పారిపోతున్నారేమో! వీరిలో మూడొంతులు — తిరిగి ఇళ్ళకి చేరుకుంటారనుకున్నా, కనీసం వెయ్యిమంది యువకులు, తిరిగిరాక, మాయమవుతున్నారన్నమాట. ఇది తల్చుకుంటే బెంగేస్తుంది.

యవ్వనం అద్భుతమైన దశ. దీన్ని పిల్లలకిచ్చి ఖర్చు చెయ్యడం నేరమే నంటాడు బెర్నార్డ్‌షా. వారు ఖర్చుచేసినా దాని ఫలితం సంఘానికి దక్కకుండా పోతోందనే నాదిగులు. ఇట్లా పారిపోయే యువకులు, పదుహేను పాతిక సంవత్సరాల వయస్సు గలవారై యుంటారు. వీరిల్లా పారిపోతున్నారంటే, సంఘంలో ఏదో తిరకాసుందన్నమాటే. లేదా, సంఘంలో ఇమడనీయని లోటు వారిలో ఏదన్నా ఉందనుకోవాలి. వారి కుటుంబమే సంఘానికి ప్రతిబింబం. దీనికి కారణం ఏమిటి?

పూర్వకాలంలో ఇట్లా ఇల్లువిడిచి వెళ్ళినవారు లేకపోలేదు. పాండవుల జీవితం ఇంచుమించు, అడవుల్లో గడిచింది. రాముడు, లక్ష్మణుడు పద్నాలుగేండ్లు అరణ్యంలో గడిపారు. రావణుడితో యుద్ధం ముగిసి లంకని జయించాక, లంకలోనే వుండిపోదామంటాడు లక్ష్మణుడు. రాముడు మందలించి తీసుకొస్తాడు. ఇంటికి చేరుకున్నాక, సీత ఎంతోకాలం ఇంట్లో వుండలేదు. ఋష్యాశ్రమంలోకి చేరుకుంది. ఈ తిరుగుడు సరదా ఆర్యులలో వుండేదేమో! భారత దేశానికి వారి రాక పై ప్రాంతంనుండే. కాని అనాదిగా దక్షిణాన వుంటున్న ద్రావిడులలో, ఇది లేనట్లుంది. ఇందుకు కారణం దక్షిణదేశపు నైసర్గికస్థితి. వీ రెక్కడికీ పారిపోలేరు. దక్షిణాన, తూర్పు, పడమరా సముద్రం వుంది. ఉత్తరానికి ప్రయాణం చెయ్యాలంటే అన్నీ అడవులు. పెద్ద పర్వతాలు.

ఇల్లు విడిచి వెళ్ళిపోయిన మరొక మహావ్యక్తి సిద్ధార్థుడు. ఎవరితో చెప్పకుండా, రాత్రి రాత్రి ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. ఎందుకు? అద్దంలో తన

మొహం చూసుకున్నాడు. నిద్రపోతున్న భార్య మొహంపై సన్నటి వెలుగు పడిన దృశ్యం చూశాడు. ఆ ఉదయం తన ఊళ్ళో వీధుల్లో చూసిన దృశ్యాలని స్మరించాడు. అతని గుండె తరుక్కుపోయింది. ఆ జుట్టు తెల్లబడిపోతుంది; ఊడిపోతుంది. మొహం అంతా మడతలు — చర్మానికి వ్యాధి; జాడ్యం; మూలుగు. చివరికి అసలు ఉండదు — మృత్యువట ఆఖరికి. చచ్చిపోయినవాడి గుండె కొట్టుకోదుట. తన గుండెమీద చెయ్యి ఆవించిచూసుకున్నాడు సిద్ధార్థుడు. గుండె పగిలినట్లయింది. ఇంతేనా ఈ సౌందర్యం, ఈ యవ్వనం? మనిషి ఎప్పుడూ, ఇల్లాగే నిత్యయవ్వనుడుగా ఎందు కుండకూడదు? ఉండాలి — ఏదో మార్గం వుండితీరాలి. అదేమిటో కనుక్కోవాలి. ఎవరితో చెప్పకూడదు. తను అన్వేషిస్తున్న రహస్యం ఏమిటో. అర్ధరాత్రి పారిపోయి, దూరంగా వెళ్ళి, అడివిలో చెట్టుకింద వొంటిగా కూర్చుని, ఆలోచనలో పడ్డాడు. అది నిర్వాణం.

ఈ శతాబ్దిలో వుండివుంటే, బుద్ధుడు ఏ రసాయనాల పరిశోధనాలయంలోనో పరిశోధన చేస్తూ గడిపేవాడు. యవ్వనాన్ని కొనసాగించే పరిశోధనలు ఇప్పుడు జరుగుతున్నాయి. ఏదో చిట్కా కనుక్కొని, నోబెల్ బహుమానం పొంది, భారత రత్నగా, పూజనీయుడయ్యేవా డనిపిస్తుంది.

మరి, నేటి యువకులు ఎందుకు పారిపోతున్నట్లు? నాకు తెలియదు. ఒక పరిశోధకుల బృందం ఇంటింటికీ వెళ్ళి, కుటుంబం పెద్దల్నడిగి, ఆరాలు తీసి, వొక చిట్టా తయారు చేస్తేగాని చెప్పలేం. నా అజ్ఞానం సూచించే కొన్ని కారణాలు పేర్కొంటాను. పరీక్షలో ఫేలవడం; విద్య చివరంటా చెప్పించే ఆర్థిక స్థోమత లేకపోవడం; తలిదండ్రులపై తోటి విద్యార్థులు వేసే అభాండాలకి తట్టుకోలేకపోవడం; కుటుంబం పెద్దలలో ఎవరో, తన తలవంపుకి కారకు లవడం; ప్రేమించిన మరోకులం కన్యని పెండ్లి చేసుకోలేకపోవడం; కోరిన కన్య మరొకర్ని వివాహమాడటం; అనువైన ఉద్యోగం దొరక్కపోవడం; వ్యభిచరించి పట్టుపడటం; పల్లెజీవితంతో విసుగెత్తి, మజాని పట్నాలలో వెదకాలని వెళ్ళడం; ఆస్తుల పంపకాలలో పేచీలు; డబ్బు కున్న పలుకుబడికి, తన ఆదర్శతత్వం దెబ్బతినడం, మతం, నమ్మకం, వీట్ల గురించి పెద్దలతో వాదోపవాదాలు; మూర్ఖత్వం — వైజ్ఞానిక దృష్టి, వీటికి చిహ్నాలైన పిన్న పెద్దల నడుమ జరిగే సంఘర్షణకి తట్టుకోలేకపోవడం — ఇట్లాంటివి కారణాలుగా తోస్తాయి. తమ క్షేమాన్నీ, భద్రతనీ ఎవరో అడ్డు తగిలి అపహరిస్తున్నారన్న భయం — ఈ కారణాల సారాంశం.



విద్యావిధానం అసంతృపి కరంగా వుంది, దీనితో సమాధానం కుదుర్చుకోలేని యువకులు పారిపోతున్నారని కొందరు. కొన్ని నిర్వచనాలు పొందుపరుస్తాను. యవ్వనం అంటే, జీవితాన్ని గూర్చిన నిజానిజాలను పెద్దలకు బోధించవలసిన సమయం; పిన్నల నుండి పెద్దలు నేర్చుకొన్నదే ప్రయోజన విద్య; ఇతరుల అజ్ఞానాన్ని విశదపరిచేదే ఉన్నత విద్య; నాన్ననీ, కాలేజినీ విడిచినప్పుడే, ఉన్నత విద్య పట్టా పొందడం; ఎవరు ఉపాధ్యాయుడు? విద్యార్థుల నిద్రా విధానాన్ని పరిశీలించే వ్యక్తి; మనం కళాశాలలో నేర్చుకున్న దంతా మరిచిపొయ్యాక మిగిలేదే నిజమైన విద్య; నేర్చుకోతగ్గ దేదీ నేర్పడం సాధ్యం కాదు; ఉపాధ్యాయుడు పిల్లలకి మేలు చేసేది తను చనిపోయిననాడే, —కారణం? ఆ రోజు పిల్లలకి శెలవు; మన కెంత తక్కువ తెలుసునో తెలుసుకునే అవకాశం ఇచ్చేదే కళాశాల చదువు; కావల్సినప్పుడు భయాన్ని నెలకొల్పేది విద్య. ఈ నిర్వచనా లన్నింటిలోకీ, చివరిది గమనించతగ్గది. ఒక విషయం గురించిన విజ్ఞానం పెరగడంతో బాటు భయంకూడా పెరుగుతూ వుంటుంది. ఈ భయం జన్మస్థానం ఏదో చెప్పలేం. కుర్రవాడు ఏదో చేస్తాడు; ఏదో అంటాడు. అదితప్పని మందలిస్తారు పెద్దలు. కూకలేస్తారు; అప్పుడప్పుడు కొడతారు. 'తప్పు' అంతే. ఎందుకు తప్పో, విడమరిచి చెప్పరు. తోటి వారితో చెప్పుకుంటాడు. వాళ్లూ చెప్పలేరు. వారూ తనలా మందలింపబడ్డవారే.

ఇదెందుకు తప్పో పాఠశాలలో, కళాశాలలో చెప్పరు. ఉపాధ్యాయుణ్ణి అడగలేడు. ఆ భయాన్ని ఎల్లానో దిగమింగుతాడు తాత్కాలికంగా. మరో తప్పు చేస్తాడు. మళ్ళా మందలిస్తారు. మళ్ళా భయాన్ని దిగమింగుతాడు. కథలు, నవలలు చదువుతాడు; సమాధానం దొరకదు. ఇల్లా దిగమింగిన భయాలన్నీ అంతరంగంలో కరుడుకట్టి, ఒక గోడలా లేచి, మనస్సంతా వ్యాపిస్తుంది. అంతరంగంలో అదిమిపట్టిన భయమునుండి పారిపోతున్నాడు యువకుడు. తన మాట, తన చేష్ట — ఈ నెరుగున్న సంఘంలో వ్యక్తులు హర్షించరు. తప్పని కసిరి కొడతారు; తనేమి చెయ్యలేడు — భయం.

పాఠశాలలో విద్యార్థిగా వుంటున్న దశలో, యువకుడికి మానసికంగా కొన్ని పేచీలు వొచ్చిపడతాయి. కాస్త పెరిగి, వితర్కించుకున్నాక, ఈ అనుభవాలు సమస్యలుగా తలెత్తి, అతని అసంతృప్తికి కారణాలవుతాయి. సంఘంలో కొన్ని కులాలవారు, కులంపేరిట అధికులుగా వుంటున్నారు. ఆ కులానికి చెందిన విద్యార్థిని, తోటి విద్యార్థులు, మాటలతో హింసించి ఏడిపిస్తారు. పాఠశాలలో అందరూ సమానులే. కాని వాస్తవానికి, కులం బట్టి వొచ్చే వ్యత్యాసాలకు, విద్యార్థి గుర్రై, బాధపడతాడు. అల్లాగే డబ్బు, హోదా — వీటివల్ల ఏర్పడే వ్యత్యాసాలూను. మా తోటి విద్యార్థి తండ్రి ఆ గ్రామంలో ప్రభుత్వోద్యోగి — అది అంత పెద్ద ఉద్యోగం కాకపోయినా, ఆ గ్రామంలోవారి కది పెద్దగా అగుపడేది. ఆ విద్యార్థిని ఇద్దరు నౌకర్లు స్కూల్లో దింపడాని కొచ్చేవారు. మళ్ళా బడి మూసెయ్యగానే, ఆ నౌకర్లు తీసుకువెళ్ళేవారు. 'ఏమిటి వీడి గొప్ప మహా.' అని, అతన్ని తోటివారు, ఏకాకిని చేసి ఏడ్పించేవారు. ఉపాధ్యాయుడు, ఆ కుర్రవాణ్ణి వెనకేసుకురావడం జరిగేది. ఇందుమూలంగా, విద్యార్థులకి ఆ ఉపాధ్యాయుడంటే గిట్టేదికాదు. తోటి విద్యార్థుల అపహాస్యానికి తట్టుకోలేక, ఆ బడిని, తనింట్లో పెట్టించమన్నాడు తండ్రిని. బడి మాన్పించి, ఇంట్లో 'ప్రైవేటు' చెప్పించాడు తండ్రి.

నాకు లెక్కలు వొచ్చేవి కావు. లెక్కల మేష్టరు శిక్షించేవాడు. గుప్పిటి బిగించిన వేళ్ళమీద బెత్తంతో కొట్టడం, స్వల్పంగా తొడపాశం — ఇట్లాంటి శిక్షలు. మా నాన్న పలుకుబడి గల ఉద్యోగి అయినా, ఈయన ఖాతరు చెయ్యక, శిక్షించేవాడు. నేను ఇంట్లో ఫిర్యాదు చేశాను నాన్న ఆ మేస్టరుకి అరటి పండ్ల గెల పంపాడు. ఓ వారం పాటు తొడపాశాలు, బెత్తం ప్రేల్పుళ్ళ లేకుండా పొయ్యాయి. బ్రిటిషు వారి పాలన కాలంలో ప్రభుత్వానికి — చిన్న గుమాస్తా అయినాసరే — చాలా పలుకుబడి వుండేది. వొందేసి ఎకరాలున్న రైతాంగం, ఆ



గుమాస్తాకి భయపడేవారు. పాలితులకు సంక్రమించే మనస్తత్వం ప్రబలడంవల్ల 'మనకీ ప్రభుత్వంతో జోక్యం వుండనక్కర్లేదు – మన కేమీ మేలు జరగదు' అన్న నైరాశ్యంతో కూడుకున్న ధృక్పథం అలవాటవుతుంది ప్రజకి. దానికనువైన వైరాగ్య దృష్టినే అలవరుచుకుంటారు. మన కింతే రాసిపెట్టుంది. మరో జన్మలో, మరో లోకంలో సుఖిద్దాం. ఇక్కడినుండి పారిపోదాం – అన్న తత్వంగా మారుతుం దన్నమాట. ఉన్నత పదవుల్లో వున్న ఉద్యోగులు కూడా, విధి నిర్వహణలో తోటి ప్రజపై లాఠీచార్జీ లాంటివి జరిపించి, రిటైరు అయ్యాక, పాప పరిహారార్థం, గీతా పఠనం, భజనలు మొదలెట్టేవారు. ఆ దాస్యంనుండి విముక్తి పొందాలనే, ఆనాటి యువకులు ఎందరో ఇళ్ళల్లోంచి పారిపోయి, కష్టాలు పడి, స్వతంత్ర నిర్మాత లయ్యారు.

ఆర్థికస్థితి, మతం, కులం – వీటివల్ల సంక్రమించే వ్యత్యాసాలు సమసిపోవాలన్నది ప్రజాస్వామ్యం. ఈ సమానతలో నిజానిజాలు పరిశీలించే ప్రథమ సంస్థ ప్రాథమిక పాఠశాల. ఇక్కడ, మంచి వేతనా లిచ్చి, సరైన ఉపాధ్యాయుల్ని పెడితే తప్ప, ఈ వ్యత్యాసాలకు కుర్రవాడు గురై, ఎదిగాక, వ్యాకులత చెందడం తప్పదు – ఇంట్లోంచి పారిపోవడం తప్పదు. అన్నీ భయాలే– డబ్బుపలుకుబడంటే భయం; పైకులం పిల్ల; కిందకులం ఉద్యోగి; ఆయన పెద్ద – అరవైయ్యేళ్ళు నిండాయి. ఆయనంటే భయం. సంప్రదాయం అంటే భయం; స్వేచ్ఛంటేనే భయం. ఈ భయంనుండి విముక్తుడవాలంటే వొకటే మార్గం –

ఇంట్లోంచి, ఊళ్ళోంచి, ఈ జనం లోంచి పారిపోవాలి. మరోచోట, మరో రకం మనుషుల మధ్యలో, హాయిగా నిష్పేచీగా, నిర్భయంగా వుండొచ్చు.

మనుషులు రెచ్చగొట్టే భయాలే కాకుండా, ప్రకృతి, సృష్టివైచిత్రి ప్రేరించే భయాలు కొన్ని వుంటాయి. విజ్ఞానశాస్త్రం ప్రబలాక, ఈ రకం భయం వొత్తిడి తగ్గినా, మన సమాజంలో ఇది వుండనే వుంది. బుద్ధుడి విషయం చూశాం, క్రైస్తు, శంకర, వేమన, రూసో, వాల్ట్, విట్‌మన్. టాల్‌స్టాయ్, లారెన్స్, షెల్లి, సుభాస్ చంద్రబోస్ – వీరంతా అంతరంగంతో ఆధ్యాత్మికంగా సమాధానం కుదుర్చుకోలేక, సమాజంలో మనుషుల్లో ఇమడలేక, ద్వంద్వాల సంఘర్షణని అంతం చెయ్యడం కోసం, దేన్నో అన్వేషిస్తూ, ప్రకృతిలోకి పారిపోయిన వ్యక్తులే. నిన్ను నువ్వు తెల్సుకో మంటుంది తత్వశాస్త్రం. వీరంతా కాస్తో కూస్తో తమ్మ తాము తెలుసుకున్న చరితార్థులే. తెలుసుకున్నాక, ఎక్కడుంటే అదే ఇల్లవుతుంది. ఇంటికి తిరిగొచ్చినట్లే.

ఈనాడు పారిపోతున్న యువకులు దేన్ని అన్వేషిస్తున్నారో, తిరిగొచ్చిన వారిని పరామర్శిస్తే తప్ప, చెప్పలేం. ఇల్లా పారిపోయిన యువకుడి కథ సినిమాలో చూస్తాం. సినిమాలో ఇట్లాంటి కథ చూసినప్పుడు "ఇదంతా అతిశయోక్తి, సత్యదూరం, మెలోడ్రామా – కేవలం అసహజమైన సినిమా కథ." అని చులకన చెయ్యడం ఆధునికులకు పరిపాటి. కాని, నేడు పారిపోతూన్న వ్యక్తుల సంఖ్యని చూస్తే, నాకు సినిమా కథ అంత అతిశయోక్తిగా కనబడదు. జీవితంలో జరుగుతున్నదానికి దగ్గరగానే వుందనిపిస్తుంది. ఎటొచ్చీ, సినిమా కథలో, ముగింపు అసాధారణమైందిగా, అతి నాటకీయతతో కలుషితమై, కళ దృష్ట్యా ఉత్తమస్థాయి నందుకోలేక పోయిం దనుకోవచ్చు. పారిపోయిన యువకుడు, రిక్షావాడుగానో, హోటల్లో సర్వర్‌గానో వుండి, కోటీశ్వరుని కుమార్తెని ప్రేమించి, పెండ్లి చేసుకోడం అసందర్భంగా అగుపడొచ్చు. పారిపోయి వొచ్చిన కుర్రవాణ్ణి ఎవరో చేరదీస్తారు. పుట్టు పూర్వోత్తరాలు బైట పెట్టక, చివరిదాక రహస్యంగా వుంచుతారు. తన పుట్టుక ఉదంతం తెలుసుకున్న బిడ్డ, మళ్ళా పారిపోతాడు. అట్లా పారిపోనీకుండా వుంచే కారణాలు కల్పించడంలోనే వుంది సినిమా కథకుడి చమత్కారం. చివర, బైటపెట్టాక, తల్లో, తండ్రో – ఎవరో వొకరు చనిపోక తప్పదు.

సినిమా కథమాట అటుంచీ, అసలు యువకులు ఇల్లా పారిపోవడానికి కారణం, సినిమాలే అన్న ఫిర్యాదు అప్పుడప్పుడు వినబడుతూ వుంటుంది.



సినిమాలో నటించాలని, ఇంట్లో చెప్పకుండా పట్నం పారిపొయ్యే యువకుల మాట అటుంచుదాం. కాలేజిలో చదువుకునే రోజుల్లో నా స్నేహితు డొకడు, ఎవరితోనూ, ఆఖరికి నాతోకూడా చెప్పకుండా, హాస్టల్‌నుంచి పారిపొయ్యాడు. అతని తండ్రి నా వద్దకు వొచ్చి, "మా వాడు ఏమయ్యాడు?" అని అడిగాడు. నాకు తెలియదన్నా. "నీ ఊహ ఏమిటి?" అన్నా డాయన. "మేం ఈమధ్య ఎక్కువగా సినిమా కబుర్లు చెప్పుకుంటున్నాం. సినమాలో చేరడానికి బొంబాయి వెళ్ళి వుండొచ్చు," అన్నాను. నే అన్నట్టుగానే, బొంబాయి సినిమా స్టుడియోలో పట్టుబడ్డాడు, నా స్నేహితుడు. సినిమాలో చేరడానికి వెళ్ళిన యువకుణ్ణి గూర్చి ఆర్. కె. నారాయణ్ వొక కథ కూడా వ్రాశాడు. కాని ఈనాడు ఇట్లా సినిమాలో చేరడానికని వెళ్ళిపొయ్యే వారిలో, పురుషుల కంటె, స్త్రీలే ఎక్కువమంది అనొచ్చునేమో.

సినిమాలో చిత్రితమయ్యే జగత్తు, యువకుడిలో రేగే అసంతృప్తికి కొంత వరకూ కారణమనుకుంటా. జీవితం, సినిమాలో చిత్రించినంతఅందంగా వుండదు. సినిమాకథలో, ఒక ధనికుడు వుంటాడు. అతని వృత్తి వ్యాపారం ఏంటో స్పష్టంగా వుండదు. అతని మేడ — అందలిగదుల వైభవం, కారు నౌకర్లు —ఇవన్నీచూస్తే, అతను కోటీశ్వరుడై వుండాలి. మధ్య పెద్దహాలు — మూలల కార్నర్ టేబుల్స్, పెద్ద పూలతొట్టిలు, గిల్ట్ ఫ్రేముల్లో పెద్ద చిత్రపటాలు, పైన వ్రేల్లాడే దీపాల గుత్తెలు, కంచుగొలుసుల ఊయెల,

స్పైరల్ మెట్లు, ఇటాలియన్ పద్ధతిలో తెరుచుకునే అద్దాలకిటికీలు. డైనింగ్ టేబిల్, సోఫాస్యూట్, పియానోవాద్యం, పెర్షియన్ తివాచీలు, మార్బుల్‌రాతి శిల్పాలు – వరండావైపు కెడితే. అందమైన ఉద్యానవనం, దానిలో నీళ్లు పొంగే ఊటకట్టడాలు, నడుమ శిల్పం, అక్కడ పిక్‌నిక్ సరంజాం, ఖరీదైన కాఫీసెట్, వంటవాడు, డ్రైవర్, గుమాస్తా – ఒక్కకూతురు. ఇంత అందంగా అమర్చబడిన భవనాలు, ఆంధ్రదేశంలో నాలుగైదే వుంటాయేమో! ఇవి నిత్య జీవితంలో యువకుడికి కనబడవు. అవి కావాలంటాడు. వాటి లేమివల్ల కొంత అసంతృప్తి. ఒకదాన్ని కోరడానికి ముందు, అట్లాంటిది ఉందనీ, సాధ్య పడుతుందనీ తెలుసుకోవాలికదా!

రాముడు చక్కనివాడని విని శూర్ప ణఖ, చూడాలని ఇంట్లోంచి పారిపోయి వొచ్చింది. సినిమాలో . కోటీశ్వరుని కొమార్తె చక్కంది; చదువుకున్నది; సంగీతం పాడుతుంది; నాట్యం చేస్తుంది; ఆమెకిచిత్రలేఖనంతెల్సు;కవిత్వంమెచ్చు కోగలదు; అవసరమొస్తే, దొంగాడిపై తుపాకీ బారుచెయ్యగలదు. ఈ కన్య నిత్యజీవితంలో కనబడదు. ఆ వయ స్సులోవారికి, పది – పదహారు లోపు వారికి, సినిమాజగత్తే యదార్థజగత్తుగా తోచి, కొంత జ్ఞానం వొచ్చి, నిజానిజాలు తెలుసుకున్నాక, ఈ సౌందర్యం తమ జీవితంలో లేదన్న నిరాశ జనించవచ్చు. చదువు, ఉద్యోగం, ప్రేమ, పెళ్ళి, స్నేహితులు, పుస్తకాలు, కులాసావ్యాప కాలు, మానసిక స్వేచ్ఛ – ఇవన్నీ వొకెత్తు; వీటిని పేర్కొని, ఇది నాకు కావాలి అని అడగొచ్చు. కాని నాకు సౌందర్యం కావాలి అని ఏ యువకుడు అనగలడు? అందుకే దాన్ని వెదుక్కుంటూ పారిపోతున్నారు. జీవితం అంతా వొక్కకళలో ప్రావీణ్యం సంపాదించడానికి వినియోగించినా పరిపక్వత సాధ్యపడదనుకుంటే, సినిమాలో నాయిక, లేతప్రాయంలో ఇన్ని కళలలో ఆరితేరి వుండటం చూస్తున్న దంపతులలో, భార్య అసూయపడకనూ మానదు, ఆ దృశ్యం చూస్తున్న యువక బ్రహ్మచారి గుండె ఆహ్లాదంతో కొట్టుకోకా మానదు. ఈ భావాన్నే వొక వచన గేయంగా కూర్చాను.

సౌందర్యం అరణాలకమ్ముతున్నారు
హాలీవుడ్‌లో
మేటనీకి సగంరేట్లు.

ఈనాడు, ఇట్లాంటి అందమైన దృశ్యాలని కూర్చి ప్రదర్శించడంలో, మన సినిమాలు, హాలీవుడ్‌వాటికి తీసిపోతాయనలేము.

మరి మార్గం ఏమిటి? యువకుడు తన జీవితంలో సౌందర్యాన్ని అనుభవించగలగాలి. ఒకటి అట్లాంటి వ్యాపకాన్ని

కళగా సాధించడం. అనుభవాన్ని ఊహలో తిప్పుకుని తన స్వార్థంతో ముడిపడ్డ వ్యక్తిగతమైన ఛాయలను తొలగించి, రచనద్వారా ఇతరులతో పంచుగుని అంతరంగ బాధనుండి విముక్తుడవాలి. చిన్నప్పుడు, రెండణాల నోటుబుక్కు కొని, శలవల్లో స్నేహితుడికి ఉత్తరంగా వ్రాస్తాడు కుర్రవాడు. అందులో విషయం ఏమీ వుండదు. కాని, తన ఆహ్లాదాన్నీ, అనుభవాన్నీ స్నేహితుడితో పంచుగుని సుఖంగా వుంటున్నాడు. అనుభవాన్ని తోటివారితో పంచుగుని, విముక్తి పొందాలన్న తృష్ణే రచనికి ప్రధాన ప్రేరణ.

నైరాశ్యాన్నుండీ, అసంతృప్తినుండీ జనించినవే కళలన్నీ నిజానికి. అహం, వ్యక్తిగతమైన తపనా తగ్గినకొద్దీ, ఆ కళాఖండానికి స్థాయీ, ఔన్నత్యమూ పెరుగుతాయి. అహం ప్రేరేపిస్తుంది; ఆ అహాన్ని దిగమింగి, కూలదోసిననాడే కళాప్రయోజనం ఆతనికి సిద్ధిస్తుంది.

ఇట్లా అనుకోడం, అజ్ఞానమేమో నన్నభయం నాలో వుండిపోయింది. ఇవన్నీ యదార్థంతో పొత్తు కుదుర్చుకోని ఉత్తుత్తి సిద్ధాంతాలేమో! పారిపోవడం, అసలు సృష్టిలక్షణమేమో. నవమాసాలూ కాగానే, తల్లి గర్భనుండి పారిపోతుంది బిడ్డ. ఇంకా నవమాసాలూ పూర్తవకుండానే పారిపోవాలని ఉబలాటపడితే, చస్తుంది. విశ్వంలో కోట్లాది గోళాలన్నీ. వొకదాన్నుండి వొకటి, వేగంగా పారిపోతున్నా యంటున్నారు ఖగోళశాస్త్రజ్ఞులు. దూరంగావున్నవి మరీ వేగంగా పారిపోతున్నాయిట. బాల్యం నుండి యౌవ్వనంలోకీ, యౌవ్వనం నుండి నడివయస్సులోకీ, దాన్నుండి వార్ధక్యంలోకీ, చివరికి మృత్యువులోకీ పారిపోతున్నాయి, ప్రాణులన్నీ. ప్రాణులేకాదు, దేశాలూ, సంస్కృతులూ, నాగరికతలూ అన్నీ ఉన్నత శిఖరాలకి ఎగబ్రాకి, లోయలోకి దూకి అంతమౌతున్నాయి. పిల్లకెరటం, తల్లి గుండెను నాలుకతో పొడిచి, ఒడ్డుకి పారిపోతుంది. తల్లి పసిదాన్ని తనలోకి తీసుకుపోతుంది. అది పెరిగి పెద్దదై తల్లినీ, అమ్మమ్మనీ చెరోచేతా పట్టుకుని ఘూర్ణా ఒడ్డుకి పారిపోతుంది. ఒడ్డు క్రుంగి, క్రుంగి, దిగజారి భూగర్భంలోకి పారిపోయి చచ్చి సముద్రంగా - (Dead Sea—) మిగిలిపోతుంది. దక్షిణమేఘం ప్రుక్కిపడి, తునియలై నేలమీదకి పారిపోతూంది. విశ్వంలో గాలులకి క్షణం స్థిమితంలేదు. అన్నిదిక్కులకూ పారిపోతున్నాయి. ఏదీ, ఎక్కడా, స్థిమితంగా నిలబడదు. అట్లా పారిపోవడం. సృష్టి ప్రధానలక్షణమేమో! అదేమార్పు: అది సృష్టిపరిణామం. ఇట్లా ఏదో అనుకుంటేతప్ప, పారిపోతూన్న యువకులని గురించిన నా బాధకి ఉపశమింపు కనబడదు.